క్లుప్తంగా

ఉద్యోగుల ధర్నా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా, జిల్లా ఇంచార్జీ విద్యాశాఖ అధికారి రాంకుమార్‌లకు వేర్వురుగా వినతిపత్రాలను అందజేశారు. వీరి ధర్నాకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర జాక్ ఉపాధ్యక్షులు సహదేవ్, భూపాలపల్లి జేఏసీ అధ్యక్షురాలు వసంతలక్ష్మి, నాయకులు వేణు, చంద్రకళ, చాంద్ పాషా, కనకలక్ష్మి, సుదర్శన్, నరేష్ పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా జగన్‌నాయక్

మల్హర్: బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్సాపల్లి గ్రామానికి చెందిన గుగులోతు జగన్‌నాయక్‌ను ఉత్తమ సర్పంచ్ నేషనల్ -2023 అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఉత్తమ సర్పంచ్ అవార్డు ఆహ్వాన పత్రాన్ని అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధకృష్ణ బీఎస్‌ఏ కార్యాలయంలో సోమవారం అందజేశారు. 27 రాష్ట్రాల నుంచి సుమారుగా 1000 మంది డెలిగెట్స్ ఈ కాన్ఫరెన్స్‌కి హాజరుకానున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ పునఃరుద్ధరణ పనుల్లో భాగంగా ఇటీవల ఆలయంలో స్వామివారి విగ్రహ జీవోద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ పూజారి మాడుగుల నాగరాజుశర్మ ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణులు మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజసంభ ప్రతిష్ఠాపన చేపట్టి ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సన్మానం

మల్హర్: జిల్లా బీసీ సంఘం ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా ఎన్నికైన విజయగిరి సమ్మయ్యను మండల, జిల్లా నాయిబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ సురేష్, భూపాలపల్లి టౌన్ అధ్యక్షుడు రమేష్, మండల నాయకులు రాజు, తిరుపతి, కొండయ్య, దేవేందర్, సంతోష్, సమ్మయ్య, సదయ్య పాల్గొన్నారు.

నియామకం

భూపాలపల్లి రూరల్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఐఎన్‌డీఐఏ) జిల్లా కన్వీనర్‌గా గణపురం మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన వెంగల రమేష్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాసాని నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర నాయకులు నర్సింగరావుకు, దైనంపల్లి మల్లికార్జున్, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఏసీ జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

మొగుళ్లపల్లి: గౌడ సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చర్లపల్లి వెంకటేశ్వర్లును నియమించినట్లు రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యలపై పోరాడుతానని తన నియమానికి సహకరించిన రాష్ట, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షన్ అందజేత

మహాముత్తారం: ప్రభుత్వం దివ్యాంగులకు నూతనంగా రూ.4016ను మంజూరు చేయడంతో మండలంలోని ములుగుపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సోమవారం సర్పంచ్ దూలం మల్లయ్య చేతుల మీదిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీన, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

టేకుమట్ల(రేగొండ): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలోని రామన్నగూడెం క్రాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణ కేంద్రానికి చెందిన తిక్క దుర్గయ్య(65) కొన్ని రోజులుగా ఇంటి నుంచి బయటకి వచ్చి తిరుగుతున్నాడు. అదే క్రమంలో రామన్నగూడెం క్రాస్ వద్ద తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతిడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై మాధవ్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బావుసింగ్‌పల్లి, జడలపేట శివారు గాంధీనగర్ గ్రామాలను మన ఊరు మన రమణన్న కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. బావుసింగ్‌పల్లిలోని చెంచులకు ఇళ్లు సక్రమంగా లేకపోవడంతో వారికి ఇళ్లు కట్టిసామని హామీ ఇచ్చారు. అలాగే జడల్‌పేట గ్రామ శివారు గాంధీనగర్‌ను సందర్శించి అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి తక్షణమే రూ.5లక్షలు మంజూరు చేశారు. అలాగే పోచమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నీటి సమస్య పరిష్కారం కోస బోరు వేసి సోలార్ లైట్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: గాంధీనగర్‌లో ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

భూపాలపల్లి రూరల్: గ్రామాల్లో పెండింగ్ పనులుంటే సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మండల లావణ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక వివరించారు. ప్రజా ప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు తగు సూచనలు చేశారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌దే అధికారమని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రంగాపురం, పెద్దకోమటిపల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మంద సాంబయ్య, గడ్డం అశోక్, సప్పిడి సదయ్య, తిరుపతి, రంగాపురం గ్రామానికి చెందిన రమేష్, ఓదెలు, ప్రశాంత్, శ్యామ్, రాజు, గని, రఘు, సాయి, శ్రావణ్, ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓంకార్, సాయిరెడ్డి, రాములు వీరితో పాటు మరికొందరు పార్టీలో చేరగా సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల కోసం బీజేపీ, బీఆర్‌ఎస్ రోజుకో పంచాయతీ తీసుకొస్తున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు యువత కృషి చేయాలని అన్నారు. మరికొద్దిరోజుల్లోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పోల్నేని లింగరావు, సుదర్శన్‌గౌడ్, ఆకుతోట కుమారస్వామి, ఎమ్‌డీ రఫీ, నడిగోటి రాము, రాజు ఉన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

భూపాలపల్లి రూరల్: అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకుడు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షతన విద్యుత్ ఉద్యోగుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల చిత్రపటాలను నివాళులర్పించి మాట్లాడారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో ఏపీఎస్ ఈబీని మూడు ముక్కలు చేయొద్దని సీపీఎంతో పాటు వామపక్షాల ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. కాగా పోరాటం చేస్తున్న ఉద్యోగులపై అప్పటి ప్రభుత్వం కాల్పులు జరిపి బాష్పవాయువు ప్రయోగించి, వేడి నీళ్లు పోసి లాఠీ చార్జీలు చేసి కాల్పులు జరిపించి ముగ్గురు ప్రాణాలను పొట్టన పెట్టుకుందన్నారు.



మాట్లాడుతున్న సాయిలు

సత్తెనపల్లి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ తుపాకి తూటాలకు అక్కడికక్కడే ప్రాణాలర్పించారన్నారు. అనేకమంది ఉద్యమకారులకు కాళ్లు చేతులు విరిగాయన్నారు. ప్రస్తుతం మోదీ సర్కారు దేశంలో విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుకరిస్తుందని వాపోయారు. సెప్టెంబర్ 1 నుంచి వారం రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, కోమల ,అశోక్ , రమేష్ , రజిత, పోచమ్మ, భారతక్క తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

● దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్ర చేపట్టిన బిహార్ యువకుడు
● తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు ఎంట్రీ

కాటారం: బైస్కిల్ రైడ్- సేవ్ ఎన్విరాల్‌మెంట్ పేరిట బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టి పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్నాడు. బిహార్ రాష్ట్రం దర్భాంగకు చెందిన సాకేత్‌కుమార్ సైకిలిస్టు వాహన కాలుష్యం కారణంగా పర్యావరణం దెబ్బతింటున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంకల్పించాడు. ఇదే క్రమంలో బైస్కిల్ రైడ్- సేవ్ ఎన్విరాల్‌మెంట్ నినాదంతో దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టాడు. నాలుగు నెలల క్రితం బిహార్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించి ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణకు వచ్చాడు. వరంగల్, భూపాలపల్లి, కాటారం మీదుగా మహారాష్ట్రకి ఎంట్రీ అవనున్నట్లు సాకేత్‌కుమార్ సాక్షికి తెలిపారు. ఇప్పటి వరకు 9 రాష్ట్రాలు పూర్తి చేసుకొని 10వ రాష్ట్రంలోకి సైకిల్ యాత్ర చేరుకొంటుందని పేర్కొన్నారు. 11 వేల కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ ప్రజలకు కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ, సైకిల్ తొక్కడంతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపాడు. దేశంలోని అన్ని రాష్ట్రాలను కవర్ చేస్తూ లడక్ వరకు సైకిల్ యాత్ర కొనసాగిస్తానని వివరించారు. సైకిల్ వినియోగించడం ద్వారా శరీరానికి వ్యాయామం లభించడంతో పాటు పర్యావరణ కాలుష్యం నివారించబడుతుందని తెలిపారు. వీలైనంత వరకు బైస్కిల్ రైడ్ చేయడానికి ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపేలా తన సైకిల్ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల మీదుగా వెళ్తున్నప్పుడు పర్యావరణ ప్రేమికులు, దాతలు భోజనం సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో తన సైకిల్ యాత్ర సజావుగా సాగుతున్నట్లు సాకేత్ తెలిపారు.



కాటారం మీదుగా సైకిల్‌యాత్ర చేస్తున్న సాకేత్

గుణాత్మక విద్య అందించాలి

గణపురం: ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిచాలని కోర్స్ డైరెక్టర్ బి స్వామి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చేపడుతున్న జిల్లా స్థాయి గణిత ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి (మంగళవారం) నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక, బోధన ప్రణాళిక తయారు చేసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించటంలో భాగంగా మూడు రోజుల పాటు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని భూపాలపల్లి, గణపురం, కాటారం, పలిమెల,చిట్యాల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రాంబాబు, రాజేంద్రప్రసాద్, శ్యామ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి

రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో బీజేపీ కీలకం

కాటారం: కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో బీజేపీ కీలకంగా వ్యవహరించింది అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం గతంలో అఖిల పక్షం జేఏసీ ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్యమం చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రెవెన్యూ డివిజన్ అవసరం లేదనే ధోరణితో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జేఏసీలో భాగస్వామ్యులు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకే ఏజెండాగా ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు పుసాల రాజేంద్రప్రసాద్, బొంతల రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

చిట్యాల: ఉపాధ్యాయ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కొత్త పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట మండల స్టీరింగ్ కమిటీ సభ్యులు పి.సమ్మయ్య, బండారి సదయ్య, చేర్రి ప్రభాకర్, బి.తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని అమలు చేయడం సరికాదని అన్నారు. అలాగే రెండవ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని, మధ్యంతర భృతిని చెల్లించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నెలనెల మొదటి తేదీనే జీతం వచ్చే విధంగా చూడాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై అభినవ్, సిబ్బంది

కాటారం: మండల పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను చేధించి సోమవారం తిరిగి బాధితులకు అందించినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మంత్రి నరేశ్, మొగుళ్లపల్లి మండలం దుబ్యాలకు చెందిన నిరంజన్‌రెడ్డి మండల పరిధిలో వారి సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. మీ సేవ ద్వారా ఫిర్యాదు చేసి పోలీసుల సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను ట్రెస్ అవుట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బాధితులకు అందజేయగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

కో-ఆర్డినేటర్‌గా తిరుపతి



చిట్యాల: చిట్యాల క్లస్టర్ రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన గుర్రపు తిరుపతిని నియమించినట్లు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే మహేందర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. తనను చిట్యాల క్లస్టర్ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్‌గా నియమించినందుకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భూపాలపల్లి రూరల్: ములుగు జిల్లా భూపాలపల్లి నియోజవర్గంలోని పెద్దాపూర్, గుర్రంపేట, సుబ్బక్కపల్లి, రాంనాయక్‌తండా, బావుసింగ్‌పల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. సీతక్క వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు వంగరవి యాదవ్, భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మామిడి శెట్టి కోటి, ఎండీ సుక్రు, కోడూరి రవి, ఎండీ అహ్మద్ పాషా, కట్టికోల వెంకటేష్, ఓం ప్రకాశ్, చింత నిప్పుల భిక్షపతి, రాంచందర్, రత్నం రవి తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

నిత్యావసర సరుకుల పంపిణీ

కాటారం: మండల కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లిం వితంతు మహిళలకు వేముల బొర్రాజు అతడి అన్న శ్రీశైలం జ్ఞాపకార్థం సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు వేముల శ్రీశైలం గత కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీశైలం మృతితో తీవ్రదిగ్భ్రాంతికి గురైన బొర్రాజు తన అన్న పేరిట పేద ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్నాడు. సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మజీద్ వద్ద వితంతు మహిళలకు పది రోజులకు సరిపడ బియ్యం, వంట సామగ్రి అందజేసి ఉదారతను చాటుకున్నారు. ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బొర్రాజు

మహిళా మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా సౌజన్య



కాటారం: బీజేపీ మహిళా మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా మేరుగు సౌజన్య నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు నడిగోట శ్రీవాణి సోమవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సునీల్‌రెడ్డితో పాటు మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి, మండల నాయకులకు సౌజన్య కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కాటారం: మంథని నియోజకవర్గం పరిధిలోని కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల్లో అభివృద్ధి పనుల కోసం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ) ద్వారా రూ.2 కోట్ల 68 లక్షల 50వేలు నిధులు మంజూరు చేయించినట్లు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాటారం మండలం ధన్వాడ, దామెరకుంట, బయ్యారం, నస్తూర్‌పల్లి, దేవరాంపల్లి, అంకుషాపూర్, గుంద్రాత్‌పల్లి, విలాసాగర్, మల్హర్ మండలం కొయ్యూర్ నాగులమ్మ టెంపుల్, కొండంపేట, అన్సాన్‌పల్లి, మల్లారం, మహాముత్తారం మండలం సింగారం, యామన్‌పల్లి, బోర్లగూడెం, పలుగుల, రాపెల్లికోట, సర్వాయిపేట, మోదేడు, లెంకలగడ్డ గ్రామాల్లో కలుపుకొని 22 బస్‌షెల్టర్ల నిర్మాణానికి గాను రూ.66 లక్షల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రుద్రారంలో బుడగ జంగమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షలు, నాచారం, కాళేశ్వరంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇబ్రహీంపల్లిలో ఈద్గా నిర్మాణానికి రూ.5లక్షలు, కొత్తపల్లి, సూరారం, మహాముత్తారంలో అభయాంజనేయ స్వామి దేవాలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మహదేవపూర్‌లో రిటైర్డ్ ఉద్యోగుల కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు, నర్సింగాపూర్ లక్ష్మీదేవర కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు, బోర్లగూడెం బాలాజీ దేవాలయం కమ్యూనిటీ హాల్ కోసం రూ.5లక్షలు, యామన్‌పల్లిలో ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు, మహదేవపూర్ క్రిష్టియన్ బెతస్థ్ ప్రార్థన మందిరం నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మెటల్‌రోడ్లు, మరుగుదొడ్లు, కంపౌండ్ వాల్స్, బోర్‌వెల్స్, డ్రైనేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి కోసం పలు నిధులు ఉపయోగించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంపై ఐదు మండలాల్లోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరకాల ఎస్‌బీఐ వద్ద నగదు అపహరణ



సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు



చోరీకి పాల్పడిన మహిళగా అనుమానిస్తున్న పోలీసులు (వృత్తంలో)

● వృద్ధురాలి నుంచి రూ.80 వేల నగదు మాయం
● సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు
● ఎత్తుకెళ్లింది మహిళగా గుర్తింపు

పరకాల: పరకాల పట్టణంలోని ఎస్‌బీఐ(ఏడీబీ)లో ఓ వృద్ధురాలు(స్వాతంత్ర్య సమరయోధురాలు) నుంచి రూ.80వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీ చేశారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. నగదు మాయం చేసింది ఓ మహిళగా పోలీసులు గుర్తించారు. పరకాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు తన రెండు నెలల ఫ్రీడమ్ పెన్షన్‌ను తీసుకెళ్లేందుకు కూతురు కట్ట సుజాతతో పరకాల ఎస్‌బీకీ చేరుకుంది. నగదు విత్‌డ్రా చేసుకొని సంచిలో పెట్టుకొని కారు ఎక్కిన కొద్ది సేపటికే సంచి కనిపించలేదు. దీంతో తన నగదును ఎవరో ఎత్తుకెళ్లినట్లు గుర్తించి లబోదిబోమంది. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడింది ఓ మహిళగా గుర్తించి ఆమె కోసం గాలిస్తున్నారు. ఎస్‌బీఐ(ఏడీబీ) వద్ద సెక్యూరిటీ సరిగా లేకపోవడంతో దొంగలకు మంచి అవకాశం ఇచ్చినట్లు అవుతోందని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

పరిహారం చెల్లించాలని వినతి



కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్ వద్ద నిల్వ చేసిన మట్టి కుప్పల గుండా వర్షాలకు వరద నీరుతో మట్టి కొట్టుకు వచ్చి దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని కలెక్టర్ భవేష్ మిశ్రాను రైతులు కోరారు. సోమవారం ప్రజావాణిలో రైతులు వారి సమస్యను వివరించారు. 2018లో ఇరిగేషన్‌శాఖ ఒక సంవత్సరం పంట నష్టం రూ.30వేలు ఎకరానికి చెల్లించి, ఇప్పటి వరకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మూడేళ్లుగా పంటనష్టం జరిగిన ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అడిషనల్ కలెక్టర్‌కు సమస్య పరిష్కరించాలని ఆదేశించారని రైతులు తెలిపారు. ములుకల రాజయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, కావేరి మొండక్క, వి.సత్యనారాయణ, పిట్టల ముత్యాలు, గుంటి రాజయ్య ఉన్నారు.